https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

10 AM TO 1 PM

సంపుటి: 01 / సంచిక:25 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 10,2026

## 22ఏ భూములపై చర్చకు డిమాండ్..



మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్

చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు

22ఏ భూములపై చర్చకు అనుమతించపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు

మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు


ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.


## రిపబ్లికన్‌లు గెలిస్తే ప్రతి ఒక్కరికి రూ.4 లక్షలు..

# డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ ఇచ్చారు. నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సభ, సెనేట్ పై పట్టు నిలబెట్టుకుంటే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్లు (సుమారు రూ.4 లక్షలు) ఇస్తామని ప్రకటించారు. ఈ మొత్తాన్ని 'ట్రంప్ డివిడెండ్ ' గా పిలుస్తామని చెప్పారు. డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావేశంలో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ఎన్నికల్లో తాను పోటీ చేయకపోయినా తనను బ్యాలెట్‌పై ఉన్నట్టుగా భావించి పార్టీకి ఓటేయాలని మద్దతుదారులను కోరారు. 'రిపబ్లికన్లు గెలిస్తే.. మీరూ గెలిచినట్లే. మీకు 5,000 డాలర్లు వస్తాయి' అని చెప్పారు. ఈ పథకానికి కనీసం 1 ట్రిలియన్ డాలర్లు అవసరమయ్యే అవకాశం ఉంది. ఇంత భారీ మొత్తాన్ని ఎక్కడ నుంచి సమకూరుస్తారన్నది ట్రంప్ స్పష్టం చేయలేదు. 'మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది' అని చెప్పారు. ఆర్థికంగా, రాజకీయంగా ఈ ప్రతిపాదన అమలు చేయడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ 30 శాతం స్థాయిలోనే ఉంది. ధరల పెరుగుదల, ఇరాన్‌పై అమెరికా చేపట్టిన యుద్ధంపై ఓటర్లలో అసంతృప్తి పెరుగుతోంది. డెమొక్రాట్లు ప్రతినిధుల సభలో 230-205 సీట్లతో, సెనేట్‌లో 51-49 ఆధిక్యంతో గెలిచే అవకాశం ఉందని 'డెసిషన్ డెస్క్ హెచ్‌క్యూ' అంచనా వేసింది. ట్రంప్ తన ప్రసంగంలో ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధం గురించి కూడా ప్రస్తావించారు. ఈ యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపిందని పరోక్షంగా అంగీకరించారు. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేసేందుకు రెండు, మూడు వారాల దూరంలో ఉందని, అందుకే యుద్ధానికి దిగాల్సి వచ్చిందని చెప్పారు. యుద్ధం త్వరలో ముగుస్తుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధికి తన పేరు పెట్టాలని సూచించారు. యుద్ధం ముగిసిన వెంటనే చమురు ధరలు తగ్గుతాయని చెప్పారు.



## ఏఐ ఫేక్ వీడియోలతో మోసాలు.. ప్రజలకు ప్రియాంక గాంధీ ఆఫీస్ హెచ్చరిక..

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:

సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఏఐ ఫేక్ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఆమె ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రియాంక గాంధీ వాయిస్, ముఖంతో ఏఐ వీడియోలు సృష్టిస్తున్నారని పేర్కొంది. ప్రియాంక గాంధీ పేరుతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వైరల్ అవుతున్న ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ వీడియోలను క్లిక్ చేయవద్దని ప్రియాంక గాంధీ ఆఫీస్ విజ్ఞప్తి చేసింది.

## ఆర్టీసీని నిర్వీర్యం చేసిన

# బీఆర్ఎస్ ప్రభుత్వం

## : మంత్రి పొన్నం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10:



ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రోజే అసెంబ్లీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆర్టీసీ డిపోలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి మండలంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లో ఆర్టీసీ డిపోల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మిర్యాలగూడలో నూతన డిపో ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. చనిపోయిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

## రేవంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన

# నోటీసులు ఇస్తాం

- కాంగ్రెస్ పార్టీ ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా దాడి చేస్తోందన్న హరీశ్
- ఫేక్ అకౌంట్లలోని పోస్టులను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారని మండిపాటు
- సభకు, ప్రజలకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.



# 80ల ట్రెండ్‌లో సీఎం రేవంత్..

## యమహా బైక్‌తో డాషింగ్ లుక్!

- సోషల్ మీడియా 80ం ట్రెండ్‌లో చేరిన సీఎం రేవంత్ రెడ్డి
- ఏఐ సాయంతో 80ల నాటి లుక్‌లో తన ఫొటో షేర్
- యమహా ఆర్ఎక్స్ 100 బైక్, పాత రేడియోతో ఆకట్టుకుంటున్న ఫొటో
- సీఎం డాషింగ్ లుక్‌పై నెటిజన్ల ప్రశంసల వర్షం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

సోషల్ మీడియాలో ప్రస్తుతం నడుస్తున్న '80ం' ట్రెండ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చేరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తనను తాను 80ల నాటి యువకుడిగా ఊహించుకుంటూ రూపొందించిన ఓ ఫొటోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఈ ఫొటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ ఫొటోలో రేవంత్ రెడ్డి డాషింగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. అప్పటి యువతకు ఐకానిక్‌గా నిలిచిన యమహా ఆర్ఎక్స్ 100 బైక్ పక్కన స్టైలిష్‌గా నిల్చుని ఉన్నారు. ఫొటోలో పాతకాలపు వాతావరణం కనిపించేలా పక్కనే ఒక వింటేజ్ రేడియోను కూడా ఉంచారు. హెయిర్‌స్టైల్, దుస్తులు, బ్యాక్‌గ్రౌండ్ అన్నీ 80ల నాటి కాలాన్ని గుర్తుచేసేలా ఉన్నాయి. "తాను కూడా 80ం ట్రెండ్‌లో జాయిన్ అయ్యానని" రేవంత్ రెడ్డి ఈ ఫొటోకు క్యాప్షన్ జోడించారు. పోస్ట్ చేసిన కొద్దిసేపటికే ఈ ఫొటో వైరల్‌గా మారింది. నెటిజన్లు, అభిమానులు దీనిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. 'అన్నా.. సూపర్', 'టాలీవుడ్ ఓ మంచి హీరోను మిస్ అయింది', 'డాషింగ్ లుక్' అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు చాలామంది ఏఐ సాయంతో ఇలాంటి ఫొటోలను సృష్టించి పంచు కుంటున్నారు. కేవలం యువతకే పరిమితం అనుకున్న ఈ ట్రెండ్‌లో ఇప్పుడు ప్రముఖ రాజకీయ నాయకులు కూడా భాగం కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# తిరుమల భక్తులకు టీటీడీ భరోసా..
## ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు!

- తిరుమల శ్రీవారి భక్తుల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచిన టీటీడీ
- దేశంలోనే తొలిసారిగా సహజ మరణానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- సెప్టెంబర్ 15 నుంచి సాలకట్ల, అక్టోబర్ 12 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- సెప్టెంబర్ 15న స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- భక్తుల కోసం రోజుకు 10 లక్షల లడ్డూలు, 9.30 లక్షల అన్నప్రసాదం భోజనాలు సిద్ధం



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అదేవిధంగా, కొండపై సహజంగా మరణించే భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశంలోని ఆలయాల పరిపాలనలో ఇలాంటి పథకం అమలు చేయడం ఇదే తొలిసారని టీటీడీ పేర్కొంది.బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసు కున్నారు. ఈ సమావేశంలో ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించడమే తమ లక్ష్యమని ఛైర్మన్ మీడియాకు తెలిపారు.

### బ్రహ్మోత్సవాల షెడ్యూల్, సీఎం పర్యటన

సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. సెప్టెంబర్ 15న ఉత్సవాల ప్రారంభం రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. సెప్టెంబర్ 16న రిలయన్స్ సంస్థ విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించడంతో పాటు, టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు.

### భారీ ఏర్పాట్లు, భద్రత

గతేడాదితో పోలిస్తే ఈసారి గరుడ సేవ రోజున 15-20 శాతం అధికంగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా రోజుకు 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా సిద్ధం చేస్తున్నారు. అన్నప్రసాదం ఏర్పాట్లను కూడా గతేడాది 6.13 లక్షల భోజనాల నుంచి ఈసారి 9.30 లక్షలకు (52% పెరుగుదల) పెంచారు. భద్రతాపరంగా 3,000 మంది పోలీసులు, 2,500 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందిని మోహరిస్తున్నారు. పారిశుద్ధ్యం కోసం అదనంగా 3,300 మంది సిబ్బందిని నియమించారు. తిరుపతి నగరంలో ప్రత్యేక హోల్డింగ్ పాయింట్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా భక్తులను తిరుమలకు తరలించనున్నారు. ఈ సమావేశంలో పాలకమండలి మరికొన్ని కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని రిటైర్డ్ సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లకు వర్తింపజేయడం, అన్నప్రసాదం వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు, నారాయణవనం, చెన్నైలోని శ్రీవారి ఆలయాల్లో బంగారు తాపడం పనులకు ఆమోదం తెలిపారు. యాత్రకు వచ్చి అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ఈ కొత్త బీమా పథకాలు అండగా నిలుస్తాయని టీటీడీ విశ్వాసం వ్యక్తం చేసింది.

---

ఫాంహౌస్ నుంచే దళితులపై దాడులకు

# ప్రణాళికలు రచిస్తున్నారు

: అద్దంకి దయాకర్

కాంగ్రెస్ శ్రేణులు డప్పు కొడితే కేసీఆర్ ఫాంహౌస్ మైలపడిందా? అని దయాకర్ మండిపాటు

శుద్ధి చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్న


రేవంత్ రెడ్డిపై ఉన్న కడుపుమంటతో అసెంబ్లీని అభాసుపాలు చేస్తున్నారని విమర్శ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10



అసెంబ్లీ సమావేశాల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య పోరు తీవ్రరూపం దాల్చింది. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ కక్షపూరిత కుట్రలు చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు."కాంగ్రెస్ శ్రేణులు డప్పులు కొడితే ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ ఏమైనా మైలపడిందా? దాన్ని శుద్ధి చేయడం ఎంతవరకు సమంజసం?" అని బీఆర్ఎస్ నాయకులను ఆయన సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలకు ప్రజాసమస్యలు పట్టవని, కేవలం రేవంత్ రెడ్డిపై ఉన్న కడుపుమంటతోనే అసెంబ్లీని అభాసుపాలు చేస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి తీవ్ర పదజాలంతో దూషించడాన్ని ఖండిస్తూ ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిర్వహించిన 'చావు డప్పు' నిరసనపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని దయాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చట్టసభలు, ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని, ఫాంహౌస్ నుంచే దళితులపై దాడులకు, ప్రభుత్వంపై కుట్రలకు ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు. వారే తప్పులు చేసి, పైగా ప్రభుత్వంపై నిందలు వేయడం బీఆర్ఎస్‌కే చెల్లిందని, వారి నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

---



ఈగోలు

వీడి ప్రజాసేవ చేద్దాం..

# స్వర్ణాంధ్ర ప్రదేశ నిర్మాణమే లక్ష్యం

: కలెక్టర్లతో సీఎం చంద్రబాబు

- ఈగోలు లేకుండా ప్రజా సేవకులుగా నిలుద్దామంటూ చంద్రబాబు పిలుపు
- రివ్యూల నుంచి రిజల్ట్ వైపు పయనిద్దాం.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మిద్దామన్న సీఎం
- 'సీఈఓ సీఎం' కన్నా 'వాటర్ మ్యాన్' అన్నప్పుడే ఎక్కువ సంతోషం కలిగిందని వెల్లడి
- 2027 మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ 'జే' బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

"అందరం ఈగోలు పక్కనపెట్టి ప్రజల కోసం పనిచేద్దాం, నిజమైన ప్రజా సేవకులుగా నిలుద్దాం. రివ్యూల నుంచి రిజల్ట్ వైపు పయనిద్దాం. వన్ స్టేట్, వన్ మిషన్, వన్ ఎయిమ్.. అదే స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సును ప్రారంభించిన ఆయన, తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ లక్ష్యాలను వివరిస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. నాయకత్వ లక్షణాలు, సుపరిపాలన, అభివృద్ధి మంత్రాలను అధికారులకు వివరించారు.

### రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టాం

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా గత 27 నెలల్లో ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ కాలంలో రూ. 1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ. 1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని వివరించారు. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్‌కు కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వంటి కార్యక్రమాలతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేశామన్నారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్రం 13.44 శాతం వృద్ధి రేటు సాధించిందని, దీన్ని 15 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని, ప్రతి నెలా ఆర్థిక నివేదిక విడుదల చేస్తూ లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నామని తెలిపారు.

### 'వాటర్ మ్యాన్' గుర్తింపు ఎంతో సంతోషాన్నిచ్చింది

తనకు 'గ్లోబల్ డ్రీమ్ కేబినెట్'లో చోటు దక్కినప్పుడు గానీ, 'సీఈఓ సీఎం' అని పిలిచినప్పుడు గానీ కలగని ఆనందం, 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించినప్పుడు కలిగిందని చంద్రబాబు అన్నారు. "రాష్ట్రంలోని భౌగోళిక అసమానతలను సరిచేస్తూ, నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాలకు నీరందించగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి-కావేరి-మహానది-గంగ వంటి నదులను అనుసంధానించి వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్‌స్టాపబుల్ అవుతుంది" అని ఆయన తన దార్శనికతను పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోల వరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేశామని గుర్తుచేశారు.

### గత ప్రభుత్వ వైఫల్యాలు.. ప్రస్తుత సవాళ్లు

గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, వారి నిర్వాకం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో మార్కెట్లోకి వచ్చిన 'జే' బ్రాండ్ల కల్తీ మద్యం కారణంగా సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వారి ఆరోగ్యం దెబ్బతింది. మేం అధికారంలోకి వచ్చాక ఆ కల్తీ బ్రాండ్లను రద్దు చేసి, పారదర్శకంగా విక్రయాలు జరిగేలా చూస్తున్నాం" అని తెలిపారు. విద్యుత్ టారిఫ్‌లు పెంచకుండానే నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పోలవరం వంటి ప్రాజెక్టులు పూర్తికాలేదని, జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర పథకాలను సరిగా వినియోగించుకోలేదని విమర్శించారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఇది నీటి భద్రతకు సవాలుగా మారిందని, ఇలాంటి సంక్షోభ సమయంలోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని పిలుపునిచ్చారు.

### సుపరిపాలన, టెక్నాలజీ వినియోగంపై దృష్టి

ప్రో-యాక్టివ్ గవర్నెన్స్‌తో సుపరిపాలన అందించాలని, ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్లేనని సీఎం అన్నారు. "టెక్నాలజీని వినియోగించి 'డీప్ టెక్ గవర్నెన్స్'తో అనూహ్య ఫలితాలు సాధించాలి. డేటా లేక్, అవేర్ వంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి" అని సూచించారు. డీఎస్సీ నియామకాలపై కొందరు ఫేక్ ప్రచారం చేస్తున్నారని, దానిని ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా తిప్పికొట్టారని అభినందించారు. రెవెన్యూ శాఖలో 120 ఏళ్ల నాటి భూ సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని, 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.ప్రతి జిల్లాలో గ్రోత్ ఇంజన్లను గుర్తించి సంపద సృష్టించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్లను కోరారు. "మీ హయాంలో ఫలానా జిల్లాలో ఈ మంచి పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో అందరం కలిసి స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం కోసం పనిచేద్దాం" అని తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---

సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకొని..


# రేవంత్ రెడ్డి పెట్టుబడులు తెస్తున్నాడు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

అమెరికా పర్యటనలో సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకొని రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి కంపెనీ టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకు కట్టబెట్టింది. ఫోర్త్ సిటీలో అక్రమంగా కట్టబెట్టిన భూమిని హరీశ్ రావు, బీఆర్ఎస ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ది గ్రేట్ అనుముల రేవంత్ రెడ్డితో ది గ్రేట్ పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్ రెడ్డితో రూ.1000 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాడు. ఇలా అనుముల జగదీశ్వర్ రెడ్డికి రూ.1000 కోట్లు, అనుముల కొండల్ రెడ్డికి రూ.250 కోట్లు ఇవ్వడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. అనుముల అన్నదమ్ముల దోపిడీ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని బీజేపీ వాళ్ళు అంటారు.. మరి దొంగని పట్టుకోవాల్సిన కేంద్ర హోమ్ మంత్రి ఎక్కడ ఉన్నాడని సూటిగా ప్రశ్నించారు.ఇజ్రాయెల్ తో ఒప్పందం చేసుకుంటే రాహుల్ గాంధీ మోడీని ప్రశ్నించాడు.. అదే రేవంత్ రెడ్డి ఇజ్రాయెల్ తో ఒప్పందం చేసుకుంటే నువ్వు ఎందుకు ప్రశ్నించడం లేదు, ఎందుకు ఈడీ విచారణకు, సీబీఐ విచారణకు ఆదేశించడం లేదన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని చూసి పొంగులేటి కూడా రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ అని స్టార్ట్ చేశాడు. ఇలా కాంగ్రెస్ అవినీతి, అక్రమాలను శాసనసభలో ప్రశ్నిస్తారనే భయపడి మమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఇలాంటి వాటికి భయపడమని ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు.



---



## జోర్డాన్‌పై దాడిలో పలు అమెరికా విమానాలు ధ్వంసం !

టెహ్రాన్: ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

జోర్డాన్‌లో ఉన్న ఎయిర్‌బేస్‌పై ఇరాన్ జరిపిన దాడిలో పలు అమెరికా విమానాలు ధ్వంసం అయినట్లు ఓ నివేదిక రిలీజైంది. ఏ-10 థండర్‌బోల్ట్.. వార్తాగ్ విమానాన్ని పేల్చేశారు. దాని రెక్క మిస్సైనట్లు గుర్తించారు. ఇక మరో ఎఫ్-15 యుద్ధ విమానాలు 8 వరకు డ్యామేజ్ అయినట్లు రిపోర్టులో తెలిపారు. ముఫాఫక్ సాల్తీ ఎయిర్ బేస్‌పై జరిగిన దాడిలో ఆ నష్టం జరిగింది. ఇరానీ దాడులను తిప్పికొట్టేందుకు జోర్డాన్‌లోని అమెరికా దళాలు సుమారు 30 పేట్రియాట్ క్షిపణులను ఫైర్ చేసినట్లు తెలిసింది. 5 ఇరానీ ట్యాంకర్లను పేల్చిన ఘటనకు ప్రతీకారంగా ఇరాన్ దాడులకు దిగింది. జోర్డాన్‌లో ఉన్న బేస్‌తో పాటు 8 ట్యంకర్లు, రెండు యుద్ధ నౌకలపై దాడి చేసినట్లు ఐఆర్జీసీ తెలిపింది. ముఫాఫక్ సాల్తీ ఎయిర్ బేస్ నుంచి అమెరికా అనేక యుద్ధ విమానాలను ఆపరేట్ చేస్తున్నది.

---

# బామ్మర్దికి అమృత్ టెండర్లు..! తమ్ముడికి రావిర్యాల భూములు శాసనమండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10



అసెంబ్లీ, శాసన మండలిలో బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్స్, మైక్ ఇవ్వక పోవడం వంటి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతున్నది. ఈ క్రమంలో చట్ట సభల్లో ప్రజల తరఫున తమ వాయిస్‌ను బలంగా వినిపించేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా శాసనమండలిలో తమ నిరసనను కెమెరాలో చూపించడం లేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వినూత్న ఆలోచన చేశారుఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) మాట్లాడేటప్పుడు పక్కన కూర్చొని, జేబులో ఉన్న పేపర్‌ను చూపిస్తూ బామ్మర్దికి అమృత్ టెండర్లు.. తమ్ముడికి రావిర్యాల భూములు.. రైజింగ్ అనుముల ఫ్యామిలీ అంటూ నిరసన తెలిపారు. గమనించిన మండలి సిబ్బంది వెంటనే కెమెరా తిప్పేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు సస్పెన్షన్ గురైన కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ సోదరుడు కొండా రెడ్డి అక్రమాలను ప్రజలకు చూయించేందుకు ఫోర్త్ సిటీకి బయలుదేరి వెళ్లారు.